బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, కలెక్టర్ హేమంత్ సహదేవ్ రావ్, ఎస్పీ సురేశ్‌కుమార్

ఆర్టీసీ సేవలను సద్వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 24 : ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, కలెక్టర్ బోర్కడ హేమంత్, ఎస్పీ సురేశ్‌కుమార్, ఎమ్మెల్యే కోవలక్ష్మి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో డిపోలో అందుబాటులోకి వచ్చిన లహరి, రాజధాని, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను డిపో మేనేజర్ శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన లహరి బస్సు ఏసీ కోచ్‌గా ఉందని, ఇందులో స్లీపర్ క్లాస్ సౌకర్యం ఉందన్నారు. అనంతరం డిపో మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ డిపోకు రెండు లహరి బస్సులు, ఒక ఎక్స్ ప్రెస్ వచ్చిందని తెలిపారు. లహరి బస్సులను హైదరాబాద్‌కు నడిపిస్తామని, స్లీపర్ కోచ్ కోసం ఒక్కొక్కరికీ రూ. 1240, సీటు బుకింగ్ కోసం రూ. 850 ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు శ్యామ్ నాయక్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బీఆర్ఎస్ యువ నాయకుడు సాయినాథ్, నాయకులు సతీష్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

నేరాల నియంత్రణకు సాంకేతికతను వాడుకోవాలి

నేర సమీక్షలో ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 24 : నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవాలని ఎస్పీ సురేశ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆసిఫాబాద్‌లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పరిశోధనతో సమగ్ర విచారణ జరిపి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని, స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించాలని, ప్రమాదాల సంఖ్య తగ్గేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో గంజాయి, పేకాట, గుడుంబా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మహిళల భద్రతే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా కోర్టులో పెండింగ్‌లోనున్న కేసుల పరిష్కారం కోసం కృషి చేసిన పోలీస్ అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచేశ్వరారావు, డీఎస్పీలు కరుణాకర్, రమేశ్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

బెల్టు షాపులు ఎత్తేయండి

జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ఎదుట మహిళల నిరసన

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 24 : బెల్ట్ షాపులు ఎత్తివేయాలని వాంకిడి మండలం గోయగాం గ్రామానికి చెందిన మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసిఫాబాద్‌లోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. వారు మాట్లాడుతూ గోయగాం గ్రామంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు చేశారని, యువత మద్యానికి బానిసై తరచూ గొడవలకు దిగుతున్నారని, వెంటనే బెల్ట్ షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఇసురుబాయి, కాంతమ్మ, కమల, సరస్వతి, తానుబాయి, అనసూయ, చంద్రకళలతో పాటు 30 మంది మహిళలు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

కనుల పండువగా రేణుకా ఎల్లమ్మ బోనాల జాతర

దండేపల్లి, జనవరి 24 : మండలంలోని నాగసముద్రం గ్రామంలో బుధవారం రేణుకా ఎల్లమ్మ బోనాల జాతర కనుల పండువగా సాగింది. గ్రామస్తులందరూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జాతరకు చుట్టుపక్క గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

రేణుకా ఎల్లమ్మ తల్లిని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు స్థానిక నాయకులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రేని శ్రీనివాస్, పూదరి రమణయ్య, వెంకటరమణ, గొట్ల భూమన్న, ముద్దసాని తిరుపతి, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

చింతపెల్లికి చెందిన ఎండీ రవూఫ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం రూ.5 వేల సాయమందించారు. అధైర్యపడవద్దు.. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, ఉపసర్పంచ్ అక్కల తిరుపతి, లింగంపెల్లి బాపు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఆ సారు టీజీవోనా.. టీఎన్‌జీవోనా..?

బై-లాకు విరుద్ధంగా రెండు సంఘాల్లో జిల్లా అసోసియేటెడ్ ప్రెసిడెంట్ ఒక్కరే

- టీఎన్‌జీవో సంఘంలో బయటపడుతున్న లుకలుకలు
- మంచిర్యాల యూనిట్‌లో ఇప్పుడున్న కమిటీపై తీవ్ర వ్యతిరేకత
- మూడేళ్ల సర్వీస్ పేరిట పోటీలో లేకుండా కుట్రలు
- ఓటర్ లిస్టు లేకుండానే ఎన్నికలకు సిద్ధం

మంచిర్యాల టీఎన్‌జీవో కార్యాలయం

మంచిర్యాల, జనవరి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'యూనియన్ బై-లాతో మంచిర్యాల టీఎన్‌జీవోకు సంబంధమే లేదు.. మేం చెప్పిందే వేదం.. మేం నడిపిందే సంఘం.. ఎవ్వరేం అనుకున్నా.. మేం చేసేది చేసుకుంటపోతం'.. అన్నట్లు ఉంది మంచిర్యాల జిల్లా టీఎన్‌జీవో వ్యవహారం. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ టీఎన్‌జీవో సంఘంలోని లుకలుకలు బయట పడుతున్నాయి. టీజీవో(తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ల) సంఘం మంచిర్యాల జిల్లా అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా ఉన్న శ్రీపతిబాబు అనే అధికారి, టీఎన్‌జీవో (తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల) సంఘం జిల్లా అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గానూ ఉన్నారు. నిబంధనల ప్రకారం ఒక అధికారి ఒక సంఘంలోనే ఉండాలి. ఆయా యూనియన్ల బై-లాలో ఇది స్పష్టంగా ఉంది. కానీ.. ఇందుకు పూర్తి విరుద్ధంగా ఒకే అధికారి రెండు సంఘాల్లో, అది ఒకే పదవిలో ఉండడం గమనార్హం. టీఎన్‌జీవో అనేది తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం.. ఇందులో గెజిటెడ్ హోదాలో ఉన్న అధికారులకు సభ్యత్వం ఉండకూడదు. కానీ ఒక్క మినహాయింపు మాత్రం ఉంది. డిప్యూటీ తహసీల్దార్(డీటీ)గా ప్రమోషన్‌పై వచ్చిన వారి హోదా గెజిటెడ్ అయినప్పటికీ టీఎన్‌జీవోలో సభ్యులుగా ఉండొచ్చు. ఇది రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే డీటీలకు మాత్రమే వర్తిస్తుంది. ఈ లెక్కనే మంచిర్యాల టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు కొనసాగుతున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో సైతం ఉంది. కానీ.. శ్రీపతిబాబు పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్నారు. ఈయన ఎంపీవో స్థాయి అధికారి, నాలుగేళ్ల క్రితం గెజిటెడ్ అయ్యారు. మరి ఈయన ఏ లెక్కన టీఎన్‌జీవో సంఘంలో కొనసాగుతున్నారనే విషయంపై స్పష్టత లేదు. అది వదిలేస్తే గెజిటెడ్ ఆఫీసర్ అయ్యాక టీజీవో సభ్యత్వం తీసుకున్న ఆయన ఆ సంఘంలోనూ కీలకమైన పదవిలో ఉన్నారు. ఈ సారైనా ఆయన టీఎన్‌జీవో సంఘం నుంచి స్వచ్ఛందంగా తప్పుకుంటారనుకుంటే.. ఇటీవల టీఎన్‌జీవో అనుబంధంగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల సంఘానికి నిర్వహించిన ఎన్నికలకు ఆయనే ఎన్నికల అధికారిగా వ్యహరించారు. ఇలా ఒకే అధికారి రెండు సంఘాల్లో పదవుల్లో ఉండడంపై టీఎన్‌జీవోలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈయన ఒక్కరనే కాదు వేర్వేరు డిపార్ట్‌మెంట్‌లలో పని చేసే గెజిటెడ్ ఆఫీసర్లకు సైతం ఇటీవల టీఎన్‌జీవో సభ్యత్వం ఇచ్చినట్లు, మరికొందరికి ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. మరి ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధమా.. కాదా అనేది తేలాల్సి ఉంది.

మంచిర్యాలలో పెరిగిన వ్యతిరేకత..

టీఎన్‌జీవో ప్రస్తుత జిల్లా కార్యవర్గం తీరుతో మంచిర్యాల యూనిట్‌లో వ్యతిరేకత పెరిగింది. నిబంధనల ఉల్లంఘనలు, వివాదాల నేపథ్యంలో ఇప్పుడున్న కార్యవర్గం నుంచి కాకుండా కొత్తగా పోటీ చేస్తున్న వారివైపు ఉద్యోగులు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. దీంతో జిల్లాలో మూడేళ్ల సర్వీస్ ఉంటేనే పోటీకి అర్హులనే వాదనను తీసుకువచ్చి, మంచిర్యాల యూనిట్‌లో పోటీ చేసే వారిని అనర్హులుగా ప్రకటించాలనే కుట్రలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. యూనియన్ బై-లా ప్రకారం టీఎన్‌జీవోలో ఏ జిల్లాలోనైనా మూడేళ్లు పని చేస్తే చాలు పోటీ చేయొచ్చు. కానీ ఇక్కడ కొత్త వివాదాన్ని తెరపైకి తీసుకవచ్చి అసలు పోటీలేకుండా ఏకగ్రీవం చేసుకోవాలని చూస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ఎవరేం అనుకున్నా ఓటరు లిస్టు లేకుండానే ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైపోయారు. బై-లా ప్రకారం ఓటర్ లిస్టు ఎన్నికలు నిర్వహించే యూనిట్లలో ఎన్నికల అధికారుల ద్వారా డిస్ప్లే చేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటి వరకు ఓటర్ లిస్ట్ బయటికి రాలేదు. అసలు సభ్యత్వ నమోదే ఇంకా పూర్తి కాలేదని తెలుస్తున్నది.

టీఎన్‌జీవో సంఘంలోనే కొనసాగుతా..

నాన్ గెజిటెడ్ క్యాడర్ నుంచి గెజిటెడ్ ఆఫీసర్ అయ్యాను. మా యూనియన్ జనరల్ బాడీ మీటింగ్‌లో, యూనియన్ బై-లాలో ఫస్ట్ లెవల్ గెజిటెడ్ ఆఫీసర్లు టీఎన్‌జీవోలో కొనసాగవచ్చనే చర్చ నడిచింది. యూనియన్‌పై ఉన్న ప్రేమతోనే టీఎన్‌జీవోలో కొనసాగుతున్నా. అసలు టీజీవో సంఘంలో నేను ఎలాంటి పదవులు ఆశించలేదు. బాధ్యత ఇచ్చారు తీసుకున్నా. టీఎన్‌జీవో నా మాతృ యూనియన్. అందులోనే ఉండాలని కోరుకుంటా.

- శ్రీపతిబాబు, టీజీవో అండ్ టీఎన్‌జీవో అసోసియేట్ ప్రెసిడెంట్

రెండు యూనియన్లలో కొనసాగడానికి వీల్లేదు

ఏ ప్రభుత్వ ఉద్యోగైనా రెండు యూనియన్లలో కొనసాగడానికి వీల్లేదు. ఫస్ట్ లెవల్ గెజిటెడ్ హోదాలో టీఎన్‌జీవోలో కొనసాగ వచ్చనే అనే అంశంపై మా యూనియన్ జనరల్ బాడీ మీటింగ్‌లో చర్చించిన మాట వాస్తవమే. దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం. కానీ ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. కానీ రెండు యూనియన్లలో కొనసాగడానికి లేదు. ఒకవేళ మంచిర్యాల సంఘంలో అలాంటి వారు ఎవరైనా ఉంటే వెంటనే వారిని యూనియన్ నుంచి తొలగిస్తాం.

- మారం జగదీశ్వర్, టీఎన్‌జీవో స్టేట్ సెక్రటరీ

రోడ్డు నిబంధనలు పాటించాలి - డీటీవో లెక్కల కిష్టయ్య

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మంచిర్యాల ఏసీసీ, జనవరి 24 : రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మంచిర్యాల జిల్లా రవాణాశాఖ అధికారి లెక్కల కిష్టయ్య అన్నారు. బుధవారం జిల్లా రవాణాశాఖ అధికారి కార్యాలయ ఆవరణ, మంచిర్యాల - లక్షెట్టిపేట రహదారిపై వాహనదారులకు ఎంవీఐలు వివేకానందరెడ్డి, రాహుల్‌తో కలిసి అవగాహన కల్పించారు. బైక్‌పై హెల్మెట్ పెట్టుకొని వెళ్తున్న వారికి గులాబీ పూలు అందించి అభినందించారు. అనంతరం వాహనదారులకు పలు సూచనలు చేసి స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాలకు కేరాఫ్.. డీఏవో ఆఫీస్..!

- జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఇష్టారాజ్యం
- నిత్యం విధులకు డుమ్మా కొడుతున్న అధికారులు
- ఏ పని కావాలన్నా కాసులివ్వాల్సిందే
- విధుల కేటాయింపుల్లోనూ చేతివాటం

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం

మంచిర్యాల అర్బన్, జనవరి 22 : జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం అక్రమాలకు కేరాఫ్ మారింది. డబ్బులివ్వనిదే ఇక్కడ ఏ పని జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎరువులు, విత్తనాల అలాట్‌మెంట్.. ఇలా ఏది కావాలన్నా.. చేయి తడపాల్సి వస్తున్నట్లు తెలుస్తున్నది. చివరకు సెలవులు కావాలన్నా కాసులివ్వాల్సి వస్తుందంటూ ఆ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులే చెబుతుండడం విమర్శలకు తావిస్తున్నది. సిబ్బందిని కంట్రోల్‌లో ఉంచాల్సిన జిల్లా స్థాయి అధికారి సైతం ఇష్టం వచ్చినట్లు విధులకు డుమ్మాలు కొడుతుండగా, ఇక ఆయా సెక్షన్‌లు చూసే ఉద్యోగులు ఆడిందే ఆట,.. పాడిందే పాటగా మారింది.

ఇబ్బందుల్లో సిబ్బంది

జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఈవోలకు సంబంధించిన సెక్షన్ అధికారి వ్యవహారంతో క్షేత్ర స్థాయి సహాయకులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ఏఈవోలకు సంబంధించి అడ్మినిస్ట్రేషన్ ఫైళ్లు పంపాలన్నా, సరెండర్ లీవు, మెడికల్ లీవు, మెడికల్ బిల్‌లు చేయాలన్నా డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు.

డబ్బు లిస్తే ఎటు నుంచి ఎటైనా...

లంచాలిస్తే.. ఏ అధికారి ఎక్కడికైనా బదిలీపై వెళ్లే వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలుస్తున్నది. ఔట్ సోర్సింగ్ ఏఈవోలకు, ఏఈవోలకు, ఏవోలకు.. డిప్యూటేషన్‌లు కావాలంటే కాసులిస్తే సరిపోతుందట. ఇటీవల బెల్లంపల్లి ఏవోను అక్కడి ఏడీఏ సురేఖ సరెండర్ చేస్తే.. ఉన్నతాధికారులు మాత్రం గుట్టు చప్పుడు కాకుండా ఆయనకు నెన్నెలలో పోస్టింగ్ ఇచ్చి డబ్బులు దండుకున్నట్లు తెలిసింది. అలాగే ఎస్‌టీఎల్‌లో ఏవోగా విధులు నిర్వహించే మరొకరికి మందమర్రిలో పోస్టింగ్ ఇవ్వగా, అక్కడ డ్యూటీ సరిగా చేయడం లేదంటూ మంచిర్యాల ఏడీఏ సరెండర్ చేశారు. ఆయనను ఏడీఏ ఆఫీసులో పీఏగా పెట్టుకుచ్చారు. కానీ ఆయన కార్యాలయంలో ఏ ఒక్క రోజూ కనిపించిన దాఖలాలు లేవు. ఖాళీగా ఉన్న ఏవో పోస్టు ఇవ్వకుండా ఆఫీసులో సీటు కేటాయించి పెట్టుకోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరో వైపు గతంలో జిల్లా కార్యాలయంలో ఇన్‌చార్జి టెక్నికల్ ఏడీఏ(బెల్లంపల్లి ఏడీఏ)గా పని చేసిన సురేఖను ఇక్కడి నుంచి పంపించడం వెనుక అంతర్యమేమిటోనని అధికారులే గుసగుసలాడుకోవడం గమనార్హం.

అధికారులు సైతం విధులకు డుమ్మా...

జిల్లా వ్యవసాయాధికారి గత నెల 11వ తేదీ నుంచి సెలవులో ఉండగా, ఆ నెలకు సంబంధించి మొత్తం జీతం తన అకౌంట్‌లో జమ అయ్యింది. ఈ నెల 3న మరోసారి లీవు కావాలని కోరగా, ఒకటవ తేదీ నుంచి 10వ తేదీ వరకు కమిషనరేట్ మంజూరు చేసింది. అలాగే చెన్నూర్ ఏడీఏకు ఇన్‌చార్జి డీఏవోగా బాధ్యతలిస్తూ ఆదేశాలు అందాయి. ఇక డీఏవో తిరిగి ఈ నెల 11వ తేదీ నుంచి విధుల్లో చేరినట్లు హైదరాబాద్ నుంచి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. అయితే జిల్లా కార్యాలయానికి మాత్రం ఈ నెల 22న వచ్చారు. ఈ పది రోజులు తన సెల్ స్విచ్చాఫ్ ఉంది. అయితే కార్యాలయానికి రాకుండానే వచ్చినట్లుగా జీతం తీసుకోగా, అధికారి క్రాప్ బుకింగ్ చూస్తే అసలు విషయం బయటకు వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. మరోవైపు కార్యాలయ సూపరింటెండెంట్ సైతం వారానికి ఒకటీరెండు రోజులే వస్తుండడం, కొందరు ఏడీఏలు కార్యాలయాలకు పోకుండానే నెల జీతం మొత్తం లేపుతున్నారనే ఆరోపణలున్నాయి. కాగా, ఈ విషయమై డీఏవోను వివరణ కోరగా, మాట దాటవేయడం కొసమెరుపు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

అవగాహన అవసరం

నస్పూర్, జనవరి 24 : జాతీయ విపత్తులు, వాటి వలన ఏర్పడే పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన అవసరమని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, ఎన్‌డీఆర్ఎఫ్ విజయవాడ ఇన్‌స్పెక్టర్ బీటెన్‌సింగ్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణలతో కలిసి ప్రకృతి విపత్తుల ప్రతిస్పందన దళం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ విపత్తులు సంభవించిన సమయంలో చేపట్టాల్సిన చర్యలపై అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీపీఆర్ ద్వారా తక్షణ వైద్య సాయమందించి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఏసీపీ తిరుపతిరెడ్డి, డీఈవో యాదయ్య, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 24 : రోడ్డు ప్రమాదాలను నివారిద్దామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆసిఫాబాద్‌లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ అధికారి గంధం లక్ష్మితో కలిసి జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) అచ్చేశ్వరరావు, ఎంవీఐ ఉమా మేశ్వరరావు, సంతోష్‌కుమార్, డీఎస్పీలు కరుణాకర్, రమేశ్, సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

అధికారులను అడ్డుకుంటున్న దుబ్బ గూడెం గ్రామస్తులు

సర్వేను అడ్డుకున్న దుబ్బ గూడెం గ్రామస్తులు

కాసిపేట, జనవరి 24 : మండలంలోని సింగరేణి కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్ నిర్వాసిత గ్రామమైన దుబ్బగూడెంలో బుధవారం రెవెన్యూ, సింగరేణి అధికారులు సర్వేకు రాగా, గ్రామస్తులు అడ్డుకున్నారు. ఎలాంటి సమాచారం లేకుండా సర్వే చేయడమేమిటని ప్రశ్నించారు. దుబ్బగూడెంలో అధికారులు ఇంటి స్థలాలు కాకుండా అదనంగా ఉన్న భూములను సర్వే చేస్తున్నారు. ముందస్తు సమాచారం లేకుంటే తమ భూములను ఎలా చూపిస్తామని, ఇప్పటికే ఒకరి భూమిని, ఒకరు రాయించుకొని డబ్బులు తీసుకున్నారని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరిద్దరి కనుసన్నల్లో అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. సర్వేను నిలిపివేస్తున్నామని, రేపటి నుంచి సర్వే చేస్తామని, అందరూ సిద్ధంగా ఉండాలని తెలిపి అధికారులు వెళ్లిపోయారు.

బాలికలు క్రీడల్లోనూ రాణించాలి

కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 24 : బాలికలు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రితో కలిసి హాజరయ్యారు. ఆడపిల్లలను కాపాడుకోవాలని, ఆడపిల్లలు వద్దనుకుంటే రేపటి సమాజం అమ్మలేని అనాథ అవుతుందన్నారు. కస్తూర్బా బాలికల విద్యాలయం, ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, బాలికలకు రక్షణ, స్వేచ్ఛ కల్పించడం కోసం ప్రభుత్వం అనేక రక్షణ చర్యలు చేపడుతుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కస్తూర్బా గాంధీ విద్యాలయం, ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి తుకారం, జీసీడీవో శకుంతల, మహిళా సాధికారత కేంద్రం సభ్యులు శారద, మమత, ఝాన్సీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

పౌష్టికాహారం తీసుకోవాలి

మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాల అర్బన్, జనవరి 24 : విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. 'ఎనిమియా ముక్త భారత్' కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని సాయికుంట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఎనిమియాపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రక్తహీనత లేని జిల్లా, రాష్ట్రం, దేశం కోసం కృషి చేయాలని కోరారు. ఇందుకోసం ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులందరికీ రక్తపరీక్షలు నిర్వహించాలని, రక్తహీనత ఉన్న వారిని గుర్తించి పోషక పదార్థాలు అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బారాయుడు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ గంగారాం, పీవో డాక్టర్ అనిత, డాక్టర్ విజయ నిర్మల, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, ఎంవోలు, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.